# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి | సంపుటి: 10 సంచిక :176 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: గురువారం 18-09-2025 | పేజీలు:4 వెల: 2.00


## ఇస్లామోఫోబిక్ వీడియో పై ఫైర్

అస్సాం:బాలీవుడ్ నటి శ్రేయా ధన్వంతరి తాజాగా అస్సాం బీజేపీపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కార ణం - ఆ పార్టీ అధికారిక సోషల్ మీడియా హ్యాండిల్ ఎక్స్ వేదికపై షేర్ చేసిన ఒక వివాదాస్పద వీడియో.ఏఐ సాయంతో రూపొందించిన ఆ వీడియోలో మైనారిటీ వర్గాన్ని కించపరిచే కంటెంట్ ఉండటంతో, ఇది మతపరమైన ద్వేషాన్ని ప్రోత్సహిస్తోందని అనేక మంది అభిప్రాయపడ్డారు.రాబోయే ఏడాది అస్సాం రాష్ట్రంలో ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో, రాజకీయ ప్రయోజనాల కోసం ద్వేషపూరిత ప్రచారాన్ని ప్రారంభించారని విమర్శలు వస్తున్నాయి. ఈ క్రమంలో నటి శ్రేయా ధన్వంతరి తన ఆవేదనను బహిరంగంగా వ్యక్తం చేశారు.. "ఇది ఇండియా కాదు. ఈ వీడియో ద్వేషపూరితంగా ఉంది. ఇలాంటి హానికరమైన ప్రచారం ఎవరూ అడ్డుకోకుండా కొనసాగుతోందా? అసలేం జరుగుతోంది మన దేశంలో?" అంటూ ఆమె ప్రశ్నించారు. ఆమె ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో చర్చకు దారితీశాయి. శ్రేయా ధన్వంతరి మాత్రమే కాకుండా, పలువురు ప్రముఖులు కూడా ఈ వీడియోపై స్పందిస్తూ అసహనం వ్యక్తం చేస్తున్నారు.

## విద్యావిధానంలో సమూల మార్పులు..పేదరిక నిర్మూలన జరగాలి



హైదరాబాద్, సెప్టెంబర్ 17: విద్యా విధానంలో సమూల మార్పులు, ప్రక్షాళన చేయాలని మా ప్రభుత్వం నిర్ణయించిందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. నూతన పాలసీ వల్ల విద్యా విధానంలో మార్పులతో పాటు పేదరిక నిర్మూలన జరగాలన్నారు. గతంలో తెలంగాణ విద్యలో ఉస్మానియా, కాకతీయ యూనివర్సిటీలు కీలక పాత్ర పోషించాయని వెల్లడించారు. ఓపెన్ మార్కెట్ కారణంగా అంతర్జాతీయ స్థాయికి మన విద్యా విధానం సరితూగడం లేదన్నారు.తెలంగాణ నూతన విద్యా విధానంపై సీఎం రేవంత్ రెడ్డి బుధవారం సచివాలయంలో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రతి సంవత్సరం 1.10 లక్షల మంది ఇంజనీరింగ్ విద్యార్థులు ఉత్తీర్ణులు అవుతున్నారు, వారిలో 15 శాతం మంది మాత్రమే ఉద్యోగాలు పొందుతున్నారన్నారు. విద్యలో ప్రభుత్వ పాత్ర తగ్గిపోతుందని వెల్లడించారు. విద్యా శాఖ కు 21 వేల కోట్లు కేటాయిస్తే అందులో 98 శాతం జీతాలకే ఖర్చు అవుతుందన్నారు.పేదరిక నిర్మూలన జరగాలంటే విద్య ఒక్కటే మార్గమని, విద్యా విధానం లో సమూల మార్పులు తీసుకురావడమే నా ధ్యేయమని సీఎం స్పష్టం చేశారు. అందుకు కావాల్సిన సలహాలు, సూచనలు ఇవ్వాలని కోరారు. 73 లక్షల మంది యువతకు మంచి భవిష్యత్తు ఇవ్వాలన్నదే నా లక్ష్యమని పేర్కొన్నారు. దేశ విద్య విధానాన్ని మార్చేలా తెలంగాణ కొత్త విద్యా విధానం ఉండాలి, పిల్లల భవిష్యత్తు కోసం ప్రణాళిక బద్దంగా పనిచేయాలన్నారు.స్కూల్ ఎడ్యుకేషన్‌లో లోపాలు ఉన్నాయి, 11 వేల ప్రైవేట్ స్కూల్స్‌లో 34 లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారన్నారు. 27 వేల ప్రభుత్వ పాఠశాలల్లో 18 లక్షల మంది విద్యార్థులు చదువుకుంటున్నారన్నారు. విద్య కోసం తీసుకునే రుణాలను ఎఫ్ ఆర్ బీ ఎం పరిధి నుంచి మినహాయింపు ఇవ్వాలని కేంద్ర ఆర్థిక మంత్రిని కోరానన్నారు.1 నుంచి 12 తరగతుల వరకు సమూల మార్పులు రావాలి, విద్య విషయంలో సమాజానికి మేలు జరుగుతుందంటే రాజకీయంగా ఎలాంటి ఇబ్బందులు ఎదురుకోవడానికైనా నేను సిద్ధమని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. ఈ సమావేశంలో కమిటీ సభ్యులు కె కేశవ రావు, ఆకునూరి మురళి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఎడ్యుకేషన్ సెక్రటరీ యోగితా రాణా, తెలంగాణ ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ బాల కిష్టా రెడ్డి, ఎంఎల్సీలు కోదండరాం, శ్రీపాల్ రెడ్డి, ఏవీఎన్ రెడ్డి, మల్క కొమరయ్య, విద్యావేత్తలు, అన్ని యూనివర్సిటీ ల వైస్ చాన్సలర్స్ లు , సీఎంఓ ముఖ్య కార్యదర్శి శేషాద్రి,ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## తెలంగాణ అంటేనే త్యాగాల అడ్డా.. పోరాటాల గడ్డ : కేటీఆర్

హైదరాబాద్ : తెలంగాణ అంటేనే త్యాగాల అడ్డా.. పోరాటాల గడ్డ అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కీలక వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ నియంతృత్వ పోకడలను ఆనాటి తెలంగాణ సాయుధ పోరాట స్ఫూర్తితో ఎదురిద్దాం. మళ్లీ కేసీఆర్ నాయకత్వంలో తిరిగి తెలంగాణను సంక్షేమ బాటలో తీసుకెళ్దామని కేటీఆర్ పిలుపునిచ్చారు. సెప్టెంబర్ 17 జాతీయ సమైక్యతా దినోత్సవం సందర్భంగా తెలంగాణ భవన్‌లో కేటీఆర్ జాతీయ జెండాను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. కొందరు విమోచనం అని, మరికొంత మంది విలీనం అని, ఇంకొంత మంది విద్రోహమని రకరకాలుగా అనవచ్చు గాక, కానీ తెలంగాణ సాయుధ పోరాటంలో ఆనాడు లక్షలాది మంది పాల్గొని వేలాది మంది అసువులు భాసారు. ఆనాటి రాచరిక వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడి మనకు స్వేచ్ఛా వాయువులు వచ్చాయంటే ఆనాటి అమరవీరుల త్యాగాలు మనందరికి ఆదర్శం. వారందరికి బీఆర్ఎస్ తరపున, కేసీఆర్, ప్రతి గులాబీ సైనికుడి తరపున వారి అమరత్వానికి శిరసు వంచి వినమ్రంగా నివాళులర్పిస్తున్నాం అని కేటీఆర్ పేర్కొన్నారు.అలాగే తెలంగాణ అంటేనే త్యాగాల అడ్డా.. పోరాటాల గడ్డ. సాయుధ పోరాటం నుంచి మొదలుపెడితే తొలి దశ తెలంగాణ ఉద్యమమైనా, ఆ తర్వాత కేసీఆర్ నాయకత్వంలో జరిగిన మలిదశ పోరాటమైనా, ఇవాళ్టికి కూడా ఈ నియంతృత్వ కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటమైనా.. వీటన్నింటికి బీజం పడ్డది తెలంగాణ సాయుధ పోరాటంతోనే. ఒక షేక్ బందగీ, దొడ్డి కొమురయ్య, ఆరుట్ల కమలమ్మ, ఆరుట్ల రామచంద్రారెడ్డి, రావి నారాయణరెడ్డి లాంటి ఎంతో మంది పెద్దలు ఆనాడు పోరాట స్ఫూర్తితో బండెనక బండికట్టి అని అద్భుతమైన కవితలు రాశారు. ఆ పెద్దల స్ఫూర్తితో, మరి భవిష్యత్‌లో కూడా ప్రజాస్వామిక ఉద్యమాలు నిర్మిస్తూ తెలంగాణలో తిరిగి సంక్షేమ రాజ్యం రావాలని, రైతు రాజ్యం రావాలని, తెలంగాణ ప్రజలు స్వేచ్ఛగా ఊపిరి పీల్చుకునే, నియంతృత్వ పోకడలు లేని ప్రజాస్వామ్య వాతావరణం రావాలని ఆశయంతో కేసీఆర్ నాయకత్వంలో పోరాటం చేస్తూనే ఉంటామని కేటీఆర్ స్పష్టం



చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వ నియంతృత్వ పోకడలకు వ్యతిరేకంగా మా విద్యార్థి తమ్ముళ్లు, చెల్లెళ్లు పోరాడుతున్నారు. ఈ కాంగ్రెస్ ప్రభుత్వం గ్రూప్-1 పోస్టుల భర్తీలో విఫలమైంది. ఈ క్రమంలో దిక్కుతోచక రౌండ్ టేబుల్ సమావేశం పెట్టుకుంటే నియంతృత్వ పోకడలతో విద్యార్థులతో అరెస్టు చేస్తున్న దుర్మార్గమైన వ్యవస్థ మన కళ్ల ముందున్నది. రైతులు ఇవాళ అల్లాడిపోతుంటే వారిని పట్టించుకోకుండా ఒలింపిక్స్ గురించి మాట్లాడుకుంటున్న ఒక నీతిమాలిన ప్రభుత్వం మన రాష్ట్రంలో ఉన్నది. ఇలాంటి నియంతృత్వ పోకడలను ఆనాటి తెలంగాణ సాయుధ పోరాట స్ఫూర్తితో ఎదురిద్దాం. కేసీఆర్ నాయకత్వంలో తిరిగి తెలంగాణను సంక్షేమ బాటలో తీసుకెళ్దాం అని కేటీఆర్ పిలుపునిచ్చారు. ఒకరు విమోచనం, ఒకరు విలీనం, ఒకరు విద్రోహం అనొచ్చు.. కానీ రాచరిక వ్యవస్థలో నుంచి ప్రజాస్వామిక వ్యవస్థలోకి సమైక్యమైన రోజు కాబట్టి జాతీయ సమైక్యతా దినోత్సవంగా పాటిస్తున్నాం. గతంలో ప్రభుత్వంలో కూడా ఈ విధంగానే పిలిచాం. ఆ రోజు జెండా ఎగురవేశాం.. ఇవాళ కూడా జెండా ఎగురవేశాం. ఆనాటి పోరాట యోధుల త్యాగాల సాక్షిగా తెలంగాణ బిడ్డలు మరోసారి పోరాటం చేయవలసిన అవసరం ఉన్నది అని కేటీఆర్ గుర్తు చేశారు.

## ఆపరేషన్ సిందూర్ ప్రతాపాన్ని జైషే కూడా అంగీకరించింది

న్యూఢిల్లీ,ఆపరేషన్ సిందూర్ దెబ్బేంటో పాకిస్థాన్ ఉగ్రవాద సంస్థలు రుచి చూశాయని.. ఈ మేరకు జైషే ఉగ్ర సంస్థ అంగీకరించిందని ప్రధాని మోడీ అన్నారు. ప్రధాని మోడీ బుధవారం 75వ పుట్టినరోజు జరుపుకుంటున్నారు.ఇక మధ్యప్రదేశ్‌లోని ధార్‌లో జరిగిన బహిరంగ సభలో మోడీ ప్రసంగించారు. ఆపరేషన్ సిందూర్ కారణంగా దెబ్బ తిన్నట్లుగా నిన్ననే ఒక పాకిస్థాన్ ఉగ్రవాద సంస్థ వెల్లడించిందని తెలిపారు. భారతమాత భద్రతకు దేశం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని చెప్పారు. పాకిస్థాన్ ఉగ్రవాదులు మన సోదరీమణుల సిందూర్‌ను తొలగించారని.. దానికి ప్రతీకారంగా ఆపరేషన్ సిందూర్ ద్వారా ఉగ్రవాద శిబిరాలను నాశనం చేసినట్లు చెప్పుకొచ్చారు. మన దళాలు.. పాకిస్థాన్ నడ్డి విరిచాయన్నారు. ఇది కొత్త భారతదేశం అని గుర్తించుకోవాలని హితవు పలికారు. ఎవరి అణు బెదిరింపులకు భయపడేది లేదని మోడీ వార్నింగ్ ఇచ్చారు.ఆపరేషన్ సిందూర్‌తో ప్రధాన కార్యాలయం ధ్వంసమైనట్లుగా జైష్ ఉగ్ర సంస్థ సోమవారం అంగీకరించింది. అంతేకాకుండా జైషే చీఫ్ మౌలానా మసూద్ అజార్ కుటుంబం కూడా హతమైనట్లు వెల్లడించింది. మే 7న భారత ప్రభుత్వం ఆపరేషన్ సిందూర్ చేపట్టింది. దాదాపు 100 మంది ఉగ్రవాదులు హతమయ్యారు. అలాగే పాకిస్థాన్ వైమానిక స్థావరాలు కూడా ధ్వంసమయ్యాయి.

చారిత్రాత్మక దినం..



ఇక ఈరోజు సెప్టెంబర్ 17 మరో చారిత్రాత్మక దినంగా మోడీ తెలిపారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ ఉక్కులాంటి దృఢ సంకల్పాన్ని చూపించారన్నారు. భారత సైన్యం హైదరాబాద్‌ను విముక్తి చేసి దాని హక్కులను కాపాడిందని గుర్తుచేశారు. దశాబ్దాలు గడిచినా ఎవరూ ఈ విజయాన్ని జరుపుకోలేదన్నారు. మన ప్రభుత్వం మాత్రం ఈ కార్యక్రమాన్ని అమరత్వంగా మార్చిందని తెలిపారు. సెప్టెంబర్ 17న హైదరాబాద్ విమోచన దినోత్సవంగా జరుపుకుంటున్నట్లు పేర్కొన్నారు.

## నక్సలైట్లను చంపితే ఫ్యాక్షనిస్టులకు, ప్రభుత్వానికి తేడా ఏముంది..?



హైదరాబాద్, మావోయిస్టులు తుపాకీ వదిలి శాంతి చర్చలకు వస్తామనడాన్ని స్వాగతిస్తున్నామని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ తెలిపారు. టెర్రరిస్టులు వేరు, నక్సలైట్లు వేరు..ప్రధాని మోడీ నక్సలైట్లపై చేసిన వ్యాఖ్యలు దుర్మార్గం అన్నారు. నక్సలైట్ల పేరుతో గిరిజనులను చంపడాన్ని వ్యతిరేకిస్తున్నాం.. బస్తర్ అడవులను ఖాళీ చేయించి విలువైన ఖనిజాలు పెత్తందార్లకు ఇవ్వాలని కేంద్రం ప్రయత్నిస్తుందని ఆయన ఆరోపించారు. నక్సలైట్లను చంపితే ఫ్యాక్షనిస్టులకు ప్రభుత్వానికి తేడా ఏముంది అని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా నక్సలైట్లతో చర్చలు జరపాలి అని డిమాండ్ చేశారు. లేదంటే, బంగ్లాదేశ్ లో ఎంపికైన ప్రభుత్వాన్ని ప్రజలే కూలగొట్టారు.. శ్రీలంక, నేపాల్ లో కూడా ఇలాగే జరిగింది.. సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం అలసత్వమే నేపాల్ తిరుగుబాటుకు ప్రధాన కారణం అని సీపీఐ నారాయణ వెల్లడించారు.ఇక, 75 ఏళ్లు దాటిన వాళ్లు పార్టీలో ఉండొచ్చు.. నాయకత్వంలో ఉండకూడదు అని నారాయణ చెప్పుకొచ్చారు. సీపీఐలో కూడా దీనిపై ఛండీఘడ్ లో జరిగే సదస్సులో చర్చిస్తామన్నారు. ఆర్ఎస్ఎస్, బీజేపీలో కూడా 75 ఏళ్లు దాటితే నాయకత్వం వదులుకోవాలనే దానిపై చర్చ జరుగుతుంది.. బహుశా రెండు మూడు నెలల్లో అది జరుగుతుందేమో అన్నారు. 2029 ఎన్నికలలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని ఉద్యమం చేపడుతుంది. అలాగే, మెడికల్ కాలేజీలను పీపీపీ పద్దతిలో నిర్మిస్తే ప్రజలకు ఉపయోగం ఉండదు.. డబ్బులు లేవంటూనే అమరావతి నిర్మాణం చేస్తున్నారు కదా.. అలాగే, మెడికల్ కాలేజీలు ప్రభుత్వమే నిర్మించాలి అని సీపీఐ నారాయణ డిమాండ్ చేశారు.

## గ్రూప్ 1 పై కీలక నిర్ణయం..




హైదరాబాద్,తెలంగాణ గ్రూప్ 1 వివాదంలో కీలక మలుపు చోటుచేసుకుంది. కొన్ని రోజుల క్రితం తెలంగాణ హైకోర్టు గ్రూప్-1 పిటిషన్లను కొట్టివేసి సంచలన తీర్పునిచ్చిన విషయం తెలిసిందే.మెయిన్స్ పరీక్ష పేపర్లను రీవాల్యుయేషన్ చేయాలని టీజీపీఎస్సీని ఆదేశించింది. రీవాల్యుయేషన్ ఆధారంగా ఫలితాలు వెల్లడించాలని ఆదేశించింది. సాధ్యంకాకపోతే పరీక్షలు మళ్లీ నిర్వహించాలని పేర్కొంటూ మెయిన్స్ మెరిట్ లిస్ట్ ను హైకోర్టు రద్దు చేసింది. దీంతో తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఈ నిర్ణయాన్ని సవాలు చేస్తూ హైకోర్టు డివిజన్ బెంచ్‌లో అప్పీల్ చేసింది. సింగిల్ బెంచ్ ఇచ్చిన ఈ తీర్పు పరీక్షా ప్రక్రియను మరింత ఆలస్యం చేస్తుందని, అభ్యర్థులకు అన్యాయం జరుగుతుందని టీజీపీఎస్సీ వాదిస్తోంది. దీంతో, ఈ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ డివిజన్ బెంచ్‌లో అప్పీల్ దాఖలు చేసింది.మూల్యాంకనంలో అక్రమాలు జరిగాయని పరీక్షలు రద్దు చేయాలని కొందరు అభ్యర్థులు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. 2023 అక్టోబర్ 21 నుంచి 27 వరకు జరిగిన గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలకు 21 వేల మంది విద్యార్థులు హాజరయ్యారు. ఆ పరీక్షల ఫలితాలను టీజీపీఎస్సీ ఈ ఏడాది మార్చి 10న విడుదల చేసింది. ఈ ఫలితాల్లో అభ్యర్థులకు వచ్చిన మార్కులపై అనేక అనుమానాలు తలెత్తాయి. పరీక్షల్లో జెల్ పెన్నులు వాడటం, కోఠి మహిళా కాలేజీలో పరీక్ష రాసిన అభ్యర్థుల్లో ఎక్కువ మంది సెలెక్ట్ కావడం, తెలుగు మీడియం అభ్యర్థులు తక్కువగా ఎంపిక కావడం, కేవలం 2 సెంటర్ల నుంచే టాపర్లు ఉండటం తదితర అంశాలపై పలువురు అభ్యర్థులు కోర్టును ఆశ్రయించారు.పరీక్షలు రద్దు చేయొద్దని కోర్టులో పిటిషన్ వేసిన ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులు. ఇప్పటికే ఇరువురి పిటిషన్లపై వాదనలు విన్న న్యాయస్థానం.. తెలంగాణ హైకోర్టు మెయిన్స్ పరీక్షలు మళ్లీ నిర్వహించాలని తుది తీర్పును వెల్లడించింది. కాగా 563 గ్రూప్ వన్ పోస్ట్ ల భర్తీకి నియామక పరీక్ష నిర్వహించింది..10th మార్చ్ న మార్క్స్ ను అభ్యర్థుల లాగిన్ %×ణ% లకు పంపించింది. వచ్చిన మార్క్ ల పై అభ్యంతరాలు ఉంటే రికౌంటింగ్ కి అవకాశం ఇచ్చింది సర్వీస్ కమిషన్.. మార్చి 24 వరకు రీ కౌంటింగ్ కు అవకాశం ఇచ్చిన సర్వీస్ కమిషన్.. ఈ ఏడాది మార్చి 30న జనరల్ ర్యాంకింగ్ లిస్టు విడుదల చేసింది.

## ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాలన్నింటినీ అమలు చేస్తున్నాం

ఖమ్మం,ప్రజా ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటిని అధికారంలోకి వచ్చిన 48 గంటల్లోనే అమలు చేయడం ప్రారంభించడం జరిగిందని తెలంగాణ రాష్ట్ర డిప్యూటీ సీఎం మల్లు బట్టి విక్రమార్క అన్నారు. తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం సందర్భంగా బుధవారం జాతీయ జెండాను ఆవిష్కరించిన అనంతరం ప్రసంగించారు. తెలంగాణ గ్రీన్ ఎనర్జీ పాలసీని ప్రభుత్వం ప్రవేశపెట్టిందని దీనిలో భాగంగా 2030 నాటికి 1 లక్ష 98 వేల కోట్ల పెట్టుబడితో 20వేల మెగావాట్ల పునర్వినియోగ శక్తి ఉత్పత్తి ద్వారా 1,14,000 మందికి ఉపాధి అవకాశాలను కల్పించడం కోసం ప్రణాళిక బద్ధంగా ముందుకు సాగుతున్నామన్నారు. ఇందిరా మహిళా శక్తి పథకం కింద మహిళా సంఘాల ద్వారా 2000 మెగావాట్ల సోలార్ విద్యుత్ ప్లాంట్ ఉత్పత్తికి ప్రణాళికలు చేపట్టామన్నారు. ఇందిరా సౌర గిరి జలవికాసం పథకం కింద 2025- 26 ఆర్థిక సంవత్సరంలో ఖమ్మం జిల్లాలో 550 మంది లబ్ధిదారులను ఎంపిక చేసి సోలార్ పంపుసెట్లు ఏర్పాటు చేయనున్న మంది తెలిపారు . పేదల సంక్షేమ పథకాలు అందించడంలో రేషన్ కార్డుల పాత్ర చాలా కీలకమైందని గత పది సంవత్సరాలుగా నిరుపేదలకు రేషన్ కార్డులు జారీలో అప్పటి పాలకులు నిర్లక్ష్యం చేశారన్నారు. ఈ విషయాన్ని ప్రజా ప్రభుత్వం గమనించి అర్హులైన పేద కుటుంబాలకు తెల్ల రేషన్ కార్డు జారీ చేసి ప్రతి వ్యక్తికి ఆరు కిలోల సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామన్నారు. ఖమ్మం జిల్లాలో ఇప్పటివరకు నూతనంగా 24, 818 మంది కుటుంబాలకు తెల్ల రేషన్ కార్డులు జారీ చేశామని దాని ద్వారా 1 లక్ష 3 వేల 166 కుటుంబాలు కుటుంబ సభ్యులు ఉచితంగా రేషన్ పొందుతున్నారన్నారు. ఆర్థిక స్థితిగతులను గాడిలో పెడుతూ ప్రజలకు ఇచ్చిన అభయ హస్తం గ్యారంటీ పథకాలైన మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, గృహజ్యోతి,500 రూపాయలకు గ్యాస్ సిలిండర్, రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లను ప్రభుత్వము అమలు చేస్తుందని అన్నారు. ఖమ్మం జిల్లాలో ఇప్పటివరకు 4 కోట్ల 44 లక్షల48 వేల224 ఉచిత బస్సు ప్రయాణాలు చేయడం వల్ల మహిళలు 209 కోట్ల 21 లక్షల 46 వేల రూపాయలు ఆదా చేశారు అన్నారు. గృహ జ్యోతి పథకం కింద జిల్లాలో ప్రభుత్వం చే 160 కోట్ల 30 లక్షల రూపాయల సబ్సిడీ చెల్లించి 2 లక్షల43 వేల 852 కుటుంబాలకు లబ్ధి చేకూర్చామని తెలిపారు. పేదల సొంత ఇంటి కల సాకారానికి ప్రజాప్రభుత్వం ఇందిరమ్మఇండ్ల పథకాన్ని అమలు చేస్తుందని ఈ పథకంలో ఐదు లక్ష రూపాయలు ఇంటి నిర్మాణానికి పూర్తిసబ్సిడీతో లబ్ధిదారుని ఖాతాలో జమ చేస్తున్నామన్నారు. మొదటి విడతగా ఖమ్మం జిల్లాలో



నియోజకవర్గంలో 3500 ఇండ్లు మంజూరు చేశామన్నారు. ఇప్పటివరకు నిర్మాణ దశలను బట్టి లబ్ధిదారుల ఖాతాలో 122 కోట్ల 89 లక్షల జమ చేశామన్నారు.నిరుపేదలకు ఆరోగ్య భద్రత కల్పించేందుకు రాజీవ్ ఆరోగ్యశ్రీ కింద ఉచిత వైద్యం పరిమితి ఐదు లక్షల నుంచి పది లక్షలకు పెంచడం జరిగిందన్నారు. ఇందుకుగాను జిల్లాలో ఇప్పటివరకు ఈ పథకం ద్వారా 10,876 మందికి వైద్య సేవలు అందించి 22 కోట్ల 90 లక్షల 57 వేల రూపాయలను ఖర్చు చేశామన్నారు. సీతారామ ఎత్తిపోతల పథకం ద్వారా జిల్లాలో 1 లక్ష 38వేల 790 ఎకరాలలో కొత్త ఆయకట్టును సాగు చేసి వసతి కల్పన చేస్తున్నామన్నారు. రఘునాథపాలెం మండలంలో చెరువుల కింద సాగునీటి సరఫరా చేసి మంచుకొండ ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేసి 455 ఎకరాలకు కొత్త ఆయకట్టు,1957 ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ పూర్తి చేశామన్నారు. మున్నేరు నది నుండి సీతారామ ఎత్తిపోత పథకం లింకు కెనాల్ పనులు 107 కోట్లతో మంజూరు చేశామన్నారు. మధిర నియోజకవర్గంలోని ఏరూరుపాలెం తోపాటు మధిర మండలాల్లో నాగార్జునసాగర్ జోన్ -3 రైతులకు సాగునీరు అందించేందుకు 630 కోట్లతో చేపట్టిన జవహర్ ఎత్తిపోతల పథకానికి శంకుస్థాపన చేశామని తెలిపారు. ఖమ్మం జిల్లాలో 1257 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా ఇందులో 70,257మంది విద్యార్థులు విద్యార్థులు ఉచితంగా విద్యను పొందుతున్నారని తెలిపారు. ఆరోగ్య లక్ష్మి పథకం ద్వారా జిల్లాలో ఒక 1840 అంగన్వాడీ కేంద్రాల ద్వారా 12,542 మంది గర్భిణీలు బాలింతలు ఆరు సంవత్సరాల లోపు వయసుగల 35,282 మంది పిల్లలకు పౌష్టికాహారంతో పాటు విద్యను అందిస్తున్నామన్నారు.

## ఆపరేషన్ కగార్ ఆపేసి నక్సలైట్లతో చర్చలు జరపాలి

హైదరాబాద్,ఆపరేషన్ కగార్ నిలిపివేయాలని మొదటి నుంచి సీపీఎం పార్టీ డిమాండ్ చేస్తుందన్నారు సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు. నిన్న నక్సలైట్ల పేరుతో బయటికి వచ్చిన లేఖ నిజమా?కాదా అన్నది పక్కన పెడితే సమస్యకు పరిష్కారం చర్చల ద్వారానే అవుతుందని ఆయన పేర్కొన్నారు.పూర్తి వివరాల్లోకి వెళితే.. సీపీఎం ఆధ్వర్యంలో సంగారెడ్డి జిల్లా పోతిరెడ్డిపల్లిలో వీర తెలంగాణ రైతాంగ పోరాట బహిరంగ సభ ఏర్పాటు చేశారు. బహిరంగ సభలో పాల్గొన్నారు సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వెంటనే కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్ ఆపేసి నక్సలైట్లతో చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. సెప్టెంబర్ 17న ఉత్సవాలు జరిపే అర్హత కాంగ్రెస్, బీజేపీ పార్టీలకు లేదని ఆయన మండిపడ్డారు.వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో కమ్యూనిస్టుల పాత్ర కీలకమన్నారాయన. తెలంగాణ సాయుధ పోరాటంలో అసలు బీజేపీ పార్టీ



లేనేలేదన్నారు. బీజేపీ విమోచనం పేరుతో మోసం చేస్తుందని.. బీజేపీ, నైజాం విధానాలు ఒక్కటే ఇద్దరు బ్రిటిష్ వారికి ఏజెంట్లుగా పని చేశారన్నారు.

# మహాఘట్ బంధన్ లెక్కతప్పుతోందా..?



పాట్నా:బిహార్ రాష్ట్రంలో ఈ నెల చివరి వరకు అసెంబ్లీ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడనుంది. ఈ నేపథ్యంలో రాజకీయ పార్టీలు వ్యూహ ప్రతి వ్యూహాలతో సిద్ధం అవుతున్నాయి. 'ఓట్ చోరీ' అంటూ ప్రచారం మొదలుపెట్టిన రాహుల్ గాంధీ ఇప్పుడు నెమ్మదించారు. ఎలక్షన్ కమిషన్, సుప్రీం కోర్టు మొట్టికాయలతో కాస్త నెమ్మదించారు. తేజస్వీ యాదవ్ పార్టీ రాష్ట్రీయ జనతా దళ్ (ఆర్జేడీ) ఈ సారి అధికారం దక్కించుకునేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తోంది. మహాఘట్ బంధన్ స్థాపించి అందులో కాంగ్రెస్ లో కలిసి పోటీకి దిగుతుంది. నితీశ్ కుమార్ కు కొంత ఆదరణ తగ్గుతుండడంతో ఈ సారి ఎలాగైనా కుర్చీని సొంతం చేసుకోవాలని ఆర్ జేడీ భావిస్తోంది. కానీ రాహుల్ తో అంటీ ముట్టనట్లుగా వ్యవహరిస్తేనే సాధ్యం అవుతుందని అనుకుంటుంది. అందుకే రెండు రోజుల క్రితం తేజస్వీ యాదవ్ అన్ని అసెంబ్లీ సీట్లలో పోటీ చేస్తామని ప్రకటించారు. తేజస్వీ యాదవ్ నిర్ణయం కాంగ్రెస్ ను కలవరపెడుతోంది.

బిహార్ లో ఆర్జేడీ బలమైన పార్టీ..

బిహార్ రాజకీయాల్లో ఆర్జేడీ బలమైన పార్టీ. లాలూ ప్రసాద్ యాదవ్ వారసత్వాన్ని తేజస్వీ యాదవ్ కొనసాగిస్తున్నారు. మైనారిటీలు, పేదలు, వెనుకబడిన వర్గాల మద్దతు ఆర్జేడీకి ఉంది. కాంగ్రెస్తో గతంలో పొత్తులు పెట్టుకున్నప్పటికీ, ప్రతి ఎన్నికలో సీట్ల కేటాయింపు విషయంలో ఇబ్బందులు ఎదురవుతూ వచ్చాయి. ఈసారి ఆర్జేడీ అన్ని సీట్లలో పోటీ చేస్తామని ప్రకటించడం.. కూటమి రాజకీయాల్లో పెను మార్పు సూచిస్తోంది.

కాంగ్రెస్పై ప్రభావం..

రెండు దశాబ్దాలను పరిశీలిస్తే బిహార్లో కాంగ్రెస్ పార్టీ బలహీన పడుతూ వస్తోంది. ఆర్జేడీ వంటి బలమైన మిత్ర పార్టీ సహకారం లేకుండా ఎన్నికల్లో పోటీ చేయడం కాంగ్రెస్కు కష్ట సాధ్యం. ఆర్జేడీ నిర్ణయం వల్ల కాంగ్రెస్ ఓటు చీలే పరిస్థితి ఏర్పడుతుంది. అంటే, కూటమి లేకపోవడం వలన బీజేపీ లేదంటే జేడీయూ వంటి పార్టీలకు లాభం కలుగవచ్చు.

సందిగ్ధంలో మహాఘట్ బందన్ భవిష్యత్తు..

ఐఎన్డీఐఏ కూటమి ఒకే వేదికపై కూర్చోడానికి ప్రయత్నిస్తున్న సమయంలో.. బిహార్లో ఈ విభేదాలు కూటమి భవిష్యత్తుకు పెద్ద సవాలుగా మారింది. తేజస్వీ ప్రకటన కూటమి ఐక్యతపై సందేహాలు రేకెత్తిస్తోంది. మరో వైపు ప్రజల్లో ప్రతిపక్షం విడిపోయిందనే భావన కలిగిస్తోంది. ఇది కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీకి అనుకూలంగా మారే అవకాశం లేకపోలేదు.

ఆర్జేడీ లెక్కలు..

సుదీర్ఘ కాలం ఆర్ జేడీ కాంగ్రెస్ పార్టీతో కలిసి నడిచింది. ఇప్పుడు కూడా కలిసే ఉంది. కానీ ఈ ఎన్నికల్లో మాత్రం సీట్ల పంపకాల్లో పట్టువీడేది లేదని స్పష్టం చేసింది. తేజస్వీ నిర్ణయాన్ని పరిశీలిస్తే పార్టీ స్వతంత్రంగా ఎదగాలని అనుకుంటుందని రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. అసలు కాంగ్రెస్ పార్టీ క్షీణ దశలో ఉంది. ఏ పార్టీ కూడా దానితో పొత్తుకు సిద్ధంగా లేవు. ఈ నేపథ్యంలో తాము కూడా అంటీ ముట్టనట్లు ఉంటే పార్టీ భవిష్యత్తు మారుతుందని అనుకుంటున్నారు. ఇక తేజ్ ప్రతాప్, తేజస్వీ యాదవ్ నేతృత్వంలో యువ ఓటర్లను ఎక్కువగా ఆకర్షించాలని అనుకుంటుంది. గతంలో పొత్తు పెట్టకున్న సమయంలో సీట్ల విషయంలో తగువులు వచ్చేవి. ఎప్పుడూ కాంగ్రెస్ తక్కువ సీట్లు కేటాయించేది. కానీ ఈ సారి అది జరగదని తేజస్వీ ప్రకటన స్పష్టం చేస్తుంది.

కాంగ్రెస్ కంటే ఆర్జేడీకి లాభం ఎక్కువ..

మహ ఘట్ బంధన్ నుంచి ఇద్దరు నాయకులు పోటీ చేస్తే సాధారణంగానే ఓట్లు చీలుతాయి. ఫలితంగా బీజేపీకే లాభం చేకూరే అవకాశం లేకపోలేదు. ఈ విషయం తేజస్వీ యాదవ్ కు తెలుసు కానీ, ఆర్ జేడీకి సొంత ఓటు బ్యాంకు ఉంది. దీనితో కాంగ్రెస్ పార్టీ కంటే ఎక్కువ లాభం పొందుతామని ఆయన భావిస్తున్నారు.

# ఏకంగా 100 మంది నేతలపై.. జగన్ సంచలనం

అమరావతి,వైసిపి అధినేత జగన్ ఒక నిర్ణయానికి వచ్చారా? పార్టీలో భారీ ప్రక్షాళన చేయనున్నారా? పనిచేయని వారిని పక్కన పెట్టనున్నారా? ఎటువంటి మొహమాటాలకు పోదలుచుకోలేదా? ఇప్పుడు పొలిటికల్ సర్కిల్లో దీనిపైనే చర్చ నడుస్తోంది. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఒక సర్వే చేస్తున్నట్లు తెలుస్తోంది. నియోజకవర్గాల వారీగా చేస్తున్న ఈ సర్వేలో.. అసలు పార్టీలో యాక్టివ్ గా ఉన్న వారు ఎవరు? లేనివారు ఎవరు? వారి ప్రభావం ఎంత ఉంటుంది? వారి స్థానంలో కొత్త నేతకు చాన్స్ ఇస్తే ఎలా ఉంటుంది? అనే దానిపై ఒక సమగ్ర సర్వే చేసినట్లు తెలుస్తోంది. అయితే రాష్ట్రవ్యాప్తంగా ఒక వందమంది నేతలు పార్టీలో యాక్టివ్ గా లేనట్లు స్పష్టమవుతోంది. అయితే వారిని పక్కన పెట్టేందుకు జగన్మోహన్ రెడ్డి సిద్ధపడుతున్నట్లు ప్రచారం జరుగుతోంది.

సీనియర్ల మౌనం..

వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి నేతల కరువు లేదు. కానీ 2024 సార్వత్రిక ఎన్నికల్లో ఓటమి తర్వాత చాలామంది నేతలు యాక్టివ్ కావడం లేదు. శ్రీకాకుళం నుంచి అనంతపురం వరకు కీలక నేతలు చాలామంది ఇంకా పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనడం లేదు. ఉన్నామంటే ఉన్నాం అన్నట్టు వారి వ్యవహార శైలి ఉంది. పార్టీ కార్యక్రమాలకు పిలుపు ఇచ్చినా ఏదో నామమాత్రంగానే హాజరవుతున్నారు. శ్రీకాకుళం జిల్లాకు చెందిన మాజీ మంత్రి ఒకరు సీనియర్ మోస్ట్ లీడర్. ఆయన ఇంతవరకు పార్టీ కార్యక్రమాల ముఖం చూడడం లేదు. కొందరైతే నియోజకవర్గాల్లో అందుబాటులోకి లేకుండా.. సాక్షి మీడియాలో ప్రకటనలకు పరిమితం అవుతున్నారు. పార్టీలో కూడా ఎవరికి వారే యమునా తీరే అన్నట్లు ఉన్నారు. కనీసం పెద్ద స్థాయి నేతలు ఎవరు జిల్లాలను టచ్ చేయడం లేదు. ఇలా అయితే కష్టమే నన్న మాట వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణుల నుంచే వినిపిస్తోంది.

ఆందోళనలు విఫలం

ఇటీవల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పుంజుకుంది అన్నది ఆ పార్టీ శ్రేణుల అభిప్రాయం. కానీ ఆ పార్టీ హైకమాండ్ ఇచ్చిన ఆందోళన కార్యక్రమాలు ఏవి ప్రజల్లోకి బలంగా వెళ్లలేదు. ఇటీవల మెడికల్ కాలేజీ ల వద్దకు వెళ్లి..అక్కడ



ఫోటోలు తీసి.. మీడియా మీట్లు నిర్వహించాలని అధినేత జగన్మోహన్ రెడ్డి ఆదేశించారు. అయితే కొన్నిచోట్ల మెడికల్ కాలేజీల నిర్మాణం జరగలేదు. మరి కొన్నిచోట్ల పునాదుల స్థాయిలోనే ఉంది. అక్కడకు వెళ్లి మీడియా మీట్లు నిర్వహించడానికి నేతలు ముఖం చాటేశారు. దీనిపై జగన్ కూడా ఆశ్చర్యపోయారు. స్వయంగా తాను ఆదేశించినా పెద్దగా ఫలితం లేకపోవడంపై పునరాలోచనలో పడ్డారు. అందుకే రాష్ట్రవ్యాప్తంగా ఏ నేత యాక్టివ్ గా ఉన్నారు? ఎవరు లేరు? అనే దానిపై ఒక సర్వే చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఒక వంద మంది నాయకులు అంత క్రియాశీలకంగా లేరని ఈ సర్వేలో తేలినట్లు తెలుస్తోంది. దీనిపై పూర్తి సమాచారం తీసుకున్నాక దిద్దుబాటు చర్యలకు దిగే అవకాశం ఉంది.

చివరిగా ఒక అవకాశం..

ఇలా గుర్తించిన వందమంది నాయకుల పనితీరు, వారి ప్రభావం ఎలా ఉంటుంది? నాయకత్వం మార్చితే ఎటువంటి పరిణామాలు జరుగుతాయి అన్నదానిపై జగన్మోహన్ రెడ్డి సీరియస్ గా ఆలోచన చేస్తున్నట్లు తెలుస్తోంది. అయితే ఈ వంద మంది నాయకులు యాక్టివ్ కావాల్సిందేనని నాయకత్వం నుంచి ఆదేశాలు వెళ్లే అవకాశం ఉంది. అక్కడకు వారు మారకుంటే మాత్రం జగన్మోహన్ రెడ్డి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు దిగడం ఖాయంగా తెలుస్తోంది. మరి ఏం జరుగుతుందో చూడాలి.

# భారత్-అమెరికా 'పొత్తు'కు సవాళ్లు..!

న్యూఢిల్లీ,అమెరికా వాణిజ్య మంత్రి హొవార్డ్ లుట్నిక్ ఇటీవల భారత్పై మొక్కజొన్న దిగుమతుల విషయంలో తీవ్ర వ్యాఖ్యలు చేశారు. 140 కోట్ల జనాభా ఉన్న భారత్, అమెరికా నుంచి ' బుట్టెడు మొక్కజొన్న కూడా కొనడం లేదు' అని ఆయన విమర్శించారు. ఈ వ్యాఖ్యలు న్యూదిల్లీలో జరగనున్న భారత్-అమెరికా వాణిజ్య చర్చలకు ముందు వ్యూహాత్మకంగా వచ్చినవిగా కనిపిస్తున్నాయి. అమెరికా మొక్కజొన్న ఎగుమతుల్లో ఎదుర్కొంటున్న సవాళ్లు, ముఖ్యంగా ట్రంప్ విధానాల వల్ల చైనాతో వాణిజ్య సంబంధాలు దెబ్బతినడం ఈ విమర్శలకు నేపథ్యంగా ఉంది.ప్రపంచంలో మొక్కజొన్న ఉత్పత్తిలో భారత్ ప్రముఖ స్థానంలో ఉంది, సంవత్సరానికి 42 మిలియన్ టన్నులతో ప్రపంచ ఉత్పత్తిలో 3% వాటా కలిగి ఉంది. అయినప్పటికీ, 2024-25లో భారత్ కేవలం 0.97 మిలియన్ టన్నుల మొక్కజొన్నను దిగుమతి చేసింది, ఇందులో మయన్మార్ నుంచి 0.53 మిలియన్ టన్నులు, ఉక్రెయిన్ నుంచి 0.39 మిలియన్ టన్నులు ఉన్నాయి. అమెరికా నుంచి దిగుమతులు కేవలం 1100 టన్నులకు పరిమితమయ్యాయి. భారత్ 0.5 మిలియన్ టన్నుల దిగుమతుల వరకు 15% సుంకం విధిస్తుంది, ఆ తర్వాత 50% టారిఫ్ అమలవుతుంది. ఈ అధిక సుంకాలు దిగుమతులను నిరుత్సాహపరుస్తాయి. భారత ప్రభుత్వం జన్యుమార్పిడి మొక్కజొన్న దిగుమతులను నిషేధించింది. ఇది అమెరికా ఎగుమతులకు పెద్ద అడ్డంకిగా నిలిచింది. ఎందుకంటే అమెరికా ఉత్పత్తిలో 94% జన్యుమార్పిడి రకాలే.

అమెరికా ఆందోళన..

అమెరికా ప్రపంచంలో మొక్కజొన్న ఉత్పత్తిలో అగ్రస్థానంలో ఉంది, 2024%-%25లో 427 మిలియన్ టన్నుల ఉత్పత్తితో ప్రపంచ మొత్తం ఉత్పత్తిలో 30%కి పైగా వాటా కలిగి ఉంది. దీనిలో 71.7 మిలియన్ టన్నులు ఎగుమతి అవుతాయి, ప్రధానంగా పౌల్ట్రీ, పశుగణం, ఇథనాల్ ఉత్పత్తి కోసం. అయోవా, ఇల్లినాయిస్, నెబ్రాస్కా వంటి రాష్ట్రాలు ఈ ఉత్పత్తిలో కీలక పాత్ర పోషిస్తాయి. అయితే, అమెరికా ఎగుమతులు 2022 తర్వాత తీవ్ర దెబ్బతిన్నాయి. చైనా, గతంలో 4 బిలియన్ డాలర్ల విలువైన మొక్కజొన్న దిగుమతి చేస్తూ అతిపెద్ద కొనుగోలుదారుగా ఉండేది, 2024లో కేవలం 331 మిలియన్ డాలర్లకు పరిమితమైంది. ట్రంప్ పరిపాలనలో చైనాపై విధించిన వాణిజ్య ఆంక్షలు, టారిఫ్ యుద్ధం ఈ తగ్గింపుకు కారణం. ఫలితంగా, అమెరికా తన అదనపు ఉత్పత్తిని విక్రయించేందుకు భారత్ వంటి కొత్త మార్కెట్లపై ఆధారపడుతోంది.



లుట్నిక్ వ్యాఖ్యలు ఈ అసంతృప్తిని, వాణిజ్య ఒత్తిడిని ప్రతిబింబిస్తాయి.

భారత్లో డిమాండ్.. జన్యుమార్పిడితో సమస్య

అమెరికా వ్యవసాయ శాఖ నివేదిక ప్రకారం, భారత్లో మొక్కజొన్న డిమాండ్ వేగంగా పెరుగుతోంది. 2022-23లో 34.7 మిలియన్ టన్నుల వినియోగం 2040 నాటికి 98 మిలియన్ టన్నులు, 2050 నాటికి 200.2 మిలియన్ టన్నులకు చేరుకుంటుందని అంచనా. ఈ డిమాండ్ను అమెరికా తన ఎగుమతులకు అవకాశంగా చూస్తోంది. అయితే, భారత్ అమెరికా నుంచి దిగుమతులను నిరాకరిస్తోంది. అమెరికా మొక్కజొన్నలో 94% జన్యుమార్పిడి రకాలు. ఈ కారణంగా భారత్ వ్యతిరేకిస్తోంది. భారత్లో మొక్కజొన్న ఉత్పత్తి ఖర్చు కిలోకు రూ.22-23, అమెరికా మొక్కజొన్న కిలో రూ.15కే లభిస్తుంది. అయినప్పటికీ, కర్ణాటక, మధ్యప్రదేశ్, బీహార్లోని రైతుల ఆర్థిక భద్రత, రాజకీయ సమీకరణలు (ముఖ్యంగా బీహార్లో రాబోయే ఎన్నికలు) దిగుమతులకు అడ్డుగా నిలుస్తున్నాయి. నీతి ఆయోగ్ సూచన ప్రకారం, జన్యుమార్పిడి మొక్కజొన్నను ఇథనాల్ ఉత్పత్తికి మాత్రమే ఉపయోగించాలని ప్రతిపాదించినప్పటికీ, దీని అమలు అనిశ్చితంగా ఉంది.అమెరికా మొక్కజొన్న ఎగుమతులకు భారత్ ఒక ఆకర్షణీయ మార్కెట్గా కనిపిస్తున్నప్పటికీ, జన్యుమార్పిడి నిషేధం, అధిక సుంకాలు, స్థానిక రైతుల ప్రయోజనాలు, రాజకీయ సందర్భాలు దిగుమతులకు అడ్డంకులుగా నిలుస్తున్నాయి. ట్రంప్ విధానాలతో చైనా వంటి ప్రధాన మార్కెట్లను కోల్పోయిన అమెరికా, భారత్పై ఒత్తిడి పెంచే అవకాశం ఉంది. అయితే, భారత్ తన రైతుల ఆర్థిక భద్రత, స్వయం సమృద్ధిని పరిగణనలోకి తీసుకుని వాణిజ్య నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంది.

# మంత్రివర్గంలోకి అయ్యన్నపాత్రుడు?



అమరావతి, ఏపీలో మంత్రివర్గ విస్తరణ పై మరోసారి బలమైన చర్చ నడుస్తోంది. క్యాబినెట్ లోకి సీనియర్లను తీసుకోవాలని ఆ పార్టీ సోషల్ మీడియాలో తెగ ప్రచారం జరుగుతోంది. గత కొద్దిరోజులుగా ఏపీ మంత్రులపై సీఎం చంద్రబాబు అసంతృప్తిగా ఉన్నట్లు వార్తలు వచ్చాయి. పనితీరు మెరుగుపరుచుకోవాలని సూచించినట్టు కూడా తెలుస్తోంది. అయితే కూటమి అధికారంలోకి వచ్చి 15 నెలలు అవుతోంది. మంత్రివర్గ విస్తరణ ఉంటుందన్న ప్రచారం సాగుతోంది. ఇటువంటి సమయంలో సీనియర్లను క్యాబినెట్ లోకి తీసుకోవాలని టిడిపి సోషల్ మీడియాలోనే చర్చ జరుగుతుండడం విశేషం. ప్రధానంగా స్పీకర్ అయ్యన్నపాత్రుడుని మంత్రివర్గంలోకి తీసుకోవాలని ఎక్కువమంది అభిప్రాయపడుతున్నారు. ఆయన లాంటి సీనియర్ అయితే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి ధీటుగా సమాధానాలు చెబుతారని ఎక్కువమంది అభిప్రాయపడుతున్నారు. పార్టీలో కూడా ఒక రకమైన చర్చ జరుగుతోంది.

ప్రతిసారి మంత్రివర్గంలో..

రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన ప్రతిసారి విశాఖ జిల్లా కోటా కింద అయ్యన్నపాత్రుడు మంత్రి అయ్యేవారు. 1983 పార్టీ ఆవిర్భావం నుంచి ఇదో సంప్రదాయంగా కొనసాగుతోంది. కానీ 2024 ఎన్నికల్లో కూటమి అధికారంలోకి రావడంతో మంత్రి పదవుల సర్దుబాటు చంద్రబాబుకు కష్టంగా మారింది. ఈ పరిస్థితుల్లో సీనియర్ గా ఉన్న అయ్యన్నపాత్రుడు కు స్పీకర్ పదవి ఇచ్చారు చంద్రబాబు. రాజ్యాంగబద్ధ పదవిలో ఉన్న రాజకీయ ప్రత్యర్థులను చురకలు అంటించడంలో అయ్యన్నపాత్రుడు చాలా దూకుడుగా ఉంటారు. ప్రస్తుతం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ బలం పెంచుకునే క్రమంలో కూటమి ప్రభుత్వంపై విమర్శలు చేస్తోంది. దానిని తిప్పి కొట్టడంలో మంత్రులు విఫలమవుతున్నారన్న విమర్శ టిడిపిలోనే వినిపిస్తోంది. అందుకే స్పీకర్ గా ఉన్న అయ్యన్నపాత్రుడు కి మంత్రి పదవి ఇస్తే బాగుంటుందన్న అభిప్రాయం వ్యక్తం అవుతోంది.

దూకుడు కలిగిన నేత..

అయ్యన్నపాత్రుడు సీనియర్ మోస్ట్ లీడర్. పార్టీలో సైతం సుదీర్ఘకాలం ఉంటూ వచ్చారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడే అధికారపక్షం పై తీవ్రస్థాయిలో విరుచుకు పడేవారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ హయాంలో నేరుగా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి వైఖరిని తప్పు పట్టేవారు. నిప్పులు తిరిగేవారు. తన మాస్ పంచులతో అధికార పక్షాన్ని ఉక్కిరిబిక్కిరి చేయగలిగారు. అందుకే అప్పట్లో అయ్యన్నపాత్రుడును టార్గెట్ చేసుకుంది వైయస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం. కానీ అయ్యన్నపాత్రుడు మాత్రం భయపడలేదు. గట్టిగానే నిలబడ్డారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని ఓడించగలిగారు. పార్టీ అంటే విపరీతమైన అభిమానం ఆయనకు. అందుకే ఇప్పుడు చివరి దశలో ఉన్న ఆయనకు మంత్రి పదవి ఇస్తే గౌరవంగా ఉంటుందన్న అభిప్రాయం వ్యక్తం అవుతోంది. ప్రధానంగా టిడిపి సోషల్ మీడియాలోనే దీనిపై విస్తృతమైన చర్చ నడుస్తోంది. చూడాలి మరి చంద్రబాబు ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో..

# జీఎస్టీ సంస్కరణలతో ప్రజలకు రూ.8 వేల కోట్ల ప్రయోజనం





అమరావతి,జీఎస్టీ 2.0 సంస్కరణలతో రాష్ట్ర ప్రజలకు రూ.8 వేల కోట్ల మేర ప్రయోజనం ప్రతీ ఏడాది కలుగుతుందని సిఎం చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. పన్నుల తగ్గింపుపై ఈ నెల 19వ తేదీన నోటిఫికేషన్లను జారీ చేసేలా కార్యాచరణ రూపొందించామని తెలిపారు.రెండోరోజు కలెక్టర్ల సదస్సులో ఈ మేరకు వివిధ అంశాలపై చర్చించారు. ప్రధానంగా జీఎస్టీ తగ్గింపులు, అమలుపై కలెక్టర్లకు దిశానిర్దేశం చేశారు. గ్రామస్థాయి వరకూ ఏ వస్తువుకు ఎంత పన్ను తగ్గిందన్న అంశాలను ప్రజలకు తెలిసేలా ఓ ప్రకటన జారీ చేస్తామని వివరించారు. జీవిత భీమా, ఆరోగ్య భీమాపై ఇప్పుడు జీఎస్టీ లేదని స్పష్టం చేశారు. యూనివర్సల్ హెల్త్ కార్డుపై ఏ మేరకు ప్రయోజనం కలుగుతుందో అంచనా వేయాలని సూచించారు. జీఎస్టీ పన్నుల తగ్గింపు ప్రయోజనాలపై నెల రోజుల పాటు- అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని అన్నారు. సెప్టెంబరు 22వ తేదీ నుంచి అక్టోబరు 22వ తేదీ వరకూ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రులు, కలెక్టర్లు, ప్రజాప్రతినిధులు పాల్గొనేలా కార్యాచరణ రూపొందిస్తామని వెల్లడించారు. జిల్లాల నుంచి జీఎస్టీ, పన్ను ఆదాయాలు ఎలా ఉన్నాయన్న విషయంపై కూడా పర్యవేక్షణ చేయాలని సూచించారు. మైనింగ్ ఆదాయంలో ఏ జిల్లాలు వెనుకంజలో ఉన్నాయో అంచనా వేస్తామని చెప్పుకొచ్చారు. జిల్లాల వారీగా మైనింగ్ ఆదాయం పెరగాలని మార్గనిర్దేశర చేశారు. ఉచిత ఇసుక విధానంలో ప్రజల్లో సంతృప్తి స్థాయి రావాలని పేర్కొన్నారు. రూ.1000 కోట్ల రెవెన్యూను ప్రభుత్వం కోల్పోయి ప్రజలకు ఉచిత ఇసుక అందిస్తోందని వెల్లడించారు. ఇలాంటి అంశాల్లో ప్రజలు సంతృప్తి చెందేలా అధికారుల పనితీరు ఉండాలని . సీఎం చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వ సేవలకు రేటింగ్స్ ఇస్తామని తెలిపారు. కలెక్టర్ల నుంచి సెక్రటరీలు రిపోర్టులు కోరవద్దని ఆదేశించారు. క్షేత్రస్థాయి సమాచారాన్ని ఆర్టీజీఎస్ నుంచి తీసుకోవాలని సూచించారు. యువ ఐఏఎస్ల సేవలను వాడుకుంటామని చెప్పుకొచ్చారు. టె-క్నాలజీ వినియోగంపై మంత్రులు, అధికారులు కలెక్టర్లకు శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు. ఆర్టీజీ జిల్లా కేంద్రాలు నవంబర్ నుంచి అందుబాటులోకి వస్తాయని వివరించారు. అలాగే, క్వాంటం భవనాల డిజైన్లపై కలెక్టర్ల అభిప్రాయం కోరారు సీఎం చంద్రబాబు.ఎర్రచందనంపై కలెక్టర్ కాన్ఫరెన్స్లో సీఎం చంద్రబాబు కీలక వ్యాఖ్యలు చేశారు. ఎర్రచందనంపై ఎన్నో ఆశలు పెట్టుకున్నామని అన్నారు. దాని విలువ లక్షల కోట్లు- అని భావించామని... అయితే మీరు దాన్ని నార్మలైజ్ చేశారని చెప్పుకొచ్చారు. ఎర్రచందనంపై ఇప్పటి-కై-నా అధికారులు కచ్చితమైన ఎ÷-లానింగ్ చేయాలని ఆదేశించారు. ఎర్రచందనం అమ్మకం ద్వారా ఆదాయం రావాలని సూచించారు.

# రైతు పథకాలను ఒకే గొడుకు కిందకు తేవాలి

న్యూఢిల్లీ, రైతులందరికీ ఉపయోగపడే విధంగా పథకాలన్నిటిని ఒకే గొడుగు కిందకు తీసుకు రావాలని కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. దేశ రైతాంగానికి ఉపయోగపడే పాలసీలను రూపొందించే కార్యక్రమం ఏర్పాటు- చేసినందుకు కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ని ఈ సందర్భంగా అభినందిస్తున్నానని పేర్కొన్నారు.మంగళవారం నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ అగ్రికల్చర్ రబీ క్యాంపెయిన్ - 2025ను కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ఆధ్వర్యంలో పలు రాష్ట్రాల వ్యవసాయ శాఖ మంత్రులు, కార్యదర్శులు, వ్యవసాయ శాఖ నిపుణులతో నిర్వహించారు. ఈ సమావేశంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొన్నారు. రైతును ఏ రకంగా కాపాడాలి, రైతు ఆదాయాన్ని ఏ రకంగా పెంచాలి, భవిష్యత్తులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఈ సమావేశంలో చర్చించారు. ఈ సమావేశంలో కొన్ని అంశాలపై ప్రస్తావించడం జరిగిందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. 1960లో చేసిన విత్తన చట్టం ఇప్పటికీ కొనసాగుతోందని చెప్పుకొచ్చారు. ఇప్పటివరకు ఈ అంశాన్ని ఎందుకు పున: పరిశీలించలేదని ప్రశ్నించారు. దానివల్ల విత్తన కంపెనీలు దగా, మోసం చేసిన రైతులు నష్టపోయిన ఏ మాత్రం వెసులుబాటు- లేదని తెలిపారు. రానున్న పార్లమెంట్ సమావేశాల్లో నూతన విత్తన చట్టాన్ని, భారత రైతాంగానికి శ్రేయస్సు చేకూర్చే విధంగా అంగీకరించాలని సూచించారు. భారతదేశంలోనే ఎక్కువ ఎకరాల్లో పామాయిల్ సాగుచేసే రాష్ట్రంగా తెలంగాణ ముందంజలో ఉందని ఉద్ఘాటించారు. పామాయిల్పై విధించిన ఇంపోర్ట్ ట్యాక్స్ను పెంచి భారత రైతులకు ఆయిల్ ఫామ్ వ్యవసాయానికి ఉపయోగపడే విధంగా చేయాలని ఆకాంక్షించారు. వ్యవసాయానికి సంబంధించి కేంద్రంలో అనేక స్కీంలు అమల్లో ఉన్నాయని పేర్కొన్నారు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు. తెలంగాణలో చేపట్టిన రైతు భరోసా, రైతు బీమా, రుణమాఫీ, 24 గంటల విద్యుత్ ఏ రాష్ట్రంలో జరుగని విధంగా రైతు సంక్షేమ కార్యక్రమాలు మన రాష్ట్రంలో జరుగుతున్నాయని వివరించారు. వీటిని దేశవ్యాప్తంగా అమలు చేయాలని సూచించారు. ఫెర్టిలైజర్స్ను రేషనలైజ్ చేయకపోవడంతో భూసారం పడిపోతుందని తెలిపారు. ఫలితంగా యూరియాను



సరిగా సరఫరా చేయలేకపోతున్నారని అన్నారు. ఇందువల్ల రైతన్నకి యూరియా కొరత వచ్చిందని చెప్పుకొచ్చారు. విదేశాల నుంచి యూరియా దిగుమతులపై కేంద్రప్రభుత్వం ఆధారపడిందని వెల్లడించారు. ఇక్కడ ఉన్న ఫ్యాక్టరీలు సైతం పనిచేయలేకపోయాయని అన్నారు. సరైన సమయంలో యూరియా సరఫరా చేయకపోవడంతో దిగుబడి తగ్గుతుందనే అపోహతో అన్నదాతలు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ఫెర్టిలైజర్స్ను రేషనలైజ్ చేసి రేట్లు- తగ్గించాలని సూచించారు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు. అలాగే, యూరియా కొరతపై కేంద్ర సహాయ మంత్రి అనుప్రియ పటేల్ను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మంగళవారం కలిశారు. యూరియా కొరత అంశంలో సహాయం అందిస్తామని అనుప్రియ పటేల్ చెప్పారని అన్నారు. ఈ వారంలో 80,000 మెట్రిక్ టన్నుల యూరియా తెలంగాణకు ఇచ్చారని, మరో 40,000 వేల మెట్రిక్ టన్నులు ఇవ్వాలని కోరానని చెప్పారు. ఇంకా రెండు లక్షల మెట్రిక్ టన్నుల యూరియా ఈ ఖరీఫ్లో అవసరం ఉందని తెలిపారు. యూరియా ఇస్తే రబీకి కూడా తాము ఎలాన్ చేసుకోగలుగుతామని అన్నారు. రబీలో ఇచ్చిన ఎ÷-లాన్ సైతం అమలు అయ్యేలా చూడాలని కోరారు. ఈ వారంలో మరో 40 వేల మెట్రిక్ టన్నులు ఇస్తామని అనుప్రియ పటేల్ హామీ ఇచ్చారని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com